క్లుప్తంగా

డాక్టరేట్ ప్రదానం


ప్రవీణ్‌రాజు

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వ విద్యాలయం హిస్టరీ అండ్ ఆర్కియాలజీ శాస్త్ర శాఖ స్కాలర్ సిహెచ్ ప్రవీణ్ రాజుకు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఈయన హిస్టరీ అండ్ ఆర్కియాలజీ శాఖ ఆచార్యులు కంకణాల గంగయ్య పర్యవేక్షణలో ' తెలంగాణలో రాక్ ఆర్ట్: టెక్నో కల్చరల్ స్టడీ 'లో పరిశోధన చేసి విశ్వవిద్యాలయానికి సమర్పించారు. ఉప కులపతి మార్గదర్శకత్వంలో నియమితులైన నిపుణుల బృందం ప్రవీణ్ రాజు సమర్పించిన థీసిస్‌ను పరిశీలించి డాక్టరేట్‌కు అర్హత ఉందంటూ నిర్ణయించారు. ఈ మేరకు వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కెఎస్వీ కృష్ణారావు డాక్టరేట్ ప్రకటించారు.

పథకాలు అమలుచేయాలి


అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కన్వీనర్ బందెల ఓబయ్య పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం నగరంలోని అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటై దాదాపు 200 రోజులు కావస్తున్నా నేటికీ కూడా ఎన్నికల హామీలు, సూపర్ సిక్స్ పథకాలు అమలు కాలేదన్నారు. వెంటనే పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు రమణ, యోబు, కృష్ణ పాల్గొన్నారు.

ఆర్థికసాయం


ఆర్థికసాయాన్ని అందజేస్తున్న ఖాసింఖాన్

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన ఇద్దరు పేద విద్యార్థుల చదువుకు సాయంగా ప్రముఖ విద్యావేత్త, సీనియర్ ఆడిటర్ లయన్ పి.ఖాసింఖాన్ ఆర్థికసాయం అందజేశారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో స్థానిక రవీంద్రనగర్‌కు చెందిన వి.లక్ష్మీదేవికి ఈ సాయాన్ని అందజేశారు. ఆమె భర్తను కోల్పోయి టైలరింగ్‌తో జీవితం గడుపుతోంది. అనారోగ్యంతో బాధపడుతూ కూడా తన ఇద్దరు కుమార్తెలు వి.యుగంధర్‌రెడ్డి, రాజేష్‌రెడ్డిలను చార్టెడ్ అకౌంటెంట్ కోర్సు చదివిస్తోంది. పత్రికాముఖంగా విషయాన్ని తెలుసుకున్న ఖాసింఖాన్ కోర్సును కొనసాగించడం కోసం ప్రతి ఏడాది రూ. 20 వేలు చొప్పున మూడు సంవత్సరాలకు రూ. 60 వేలు సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. అందులో భాగంగా ఆయన బుధవారం రూ. 40 వేలు అందజేశారు.

అబాకస్ పోటీలలో ప్రతిభ


అబాకస్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్ : జిల్లాస్థాయి అబాకస్ పోటీలలో కడప నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇందులో శ్రీనిధిరెడ్డి, రేమాన్‌ఖాన్‌లు మొదటి బహుమతి సాధించగా, కాశ్విరెడ్డి, అయిష్‌పాల్, శివసాహిత్రిప్రియ, మోక్షిత్‌రెడ్డి, దిశ్వవర్షితలు రెండవ బహుమతులు సాధించగా, నివేదితరెడ్డి, పూర్వజ్‌ప్రణవ్‌లు మూడవ బహుమతిని సాధించారు. జిల్లాస్థాయిలో ప్రతిభచాటి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ శివతులశమ్మ, డైరెక్టర్ శివ ప్రసాద్‌రెడ్డి, హెడ్‌మిసెస్ సుశీలదేవి అభినందించారు.

అన్నదానం

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని జెడ్పీ కాంపౌండ్‌లో ఉన్న ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో బుధవారం శ్రీ సాయి యువజన సేవా సంఘం చైర్మన్ మలిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి ఎం. సుబ్బారెడ్డి 30వ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలిరెడ్డి శివ శంకర్ రెడ్డి, 9వ డివిజన్ మాజీ వార్డు సభ్యుడు ఎం. భాస్కర్ రెడ్డి, డి సుబ్బారాయుడు, ఎంవీ క్రిష్ణారెడ్డి, పి. శివశంకర్, ప్రేమాలయ వసతి గృహం నిర్వాహకులు శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

కడప అర్బన్ : కడప నగరంలోని తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో రామరాజు పల్లి గూడూరు హరిజనవాడలో నివాసముంటున్న కంభం పెంచలయ్య పై పాత కక్షలతో రాజగోపాల్, చంటి, అంజి, కుటుంబ సభ్యులు రాడ్లతో దాడి చేశారు. ఈ సంఘటన ఈనెల 4వ తేదీ రాత్రి జరిగింది. ఈ సంఘటనపై బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రదీప్ నాయుడు తెలిపారు.

దేవుని కడపలో భక్తుల సందడి


గ్రామోత్సవంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు


గ్రామోత్సవంలో నృత్యాలు చేస్తున్న కళాకారులు

కడప కల్చరల్ : దేవుని కడపలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం కడప రాయుడికి విశేష పూజలు చేశారు. రాత్రి గ్రామోత్సవంలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

22న 'ఉయ్యాలవాడ' వర్ధంతి సభ


విలేకరులతో మాట్లాడుతున్న రవిశంకర్ రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : తొలి స్వాతంత్య్ర సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని రేనాటి సూర్యచంద్రుల విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 22న కడప ప్రెస్‌క్లబ్‌లో నిర్వహిస్తున్నామని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి ఎస్.రవిశంకర్ రెడ్డి, జానమద్ది సాహితీ పీఠం అధ్యక్షులు జానమద్ది విజయభాస్కర్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మన్సూరు అక్బర్ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. నగరంలో ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి, మహాదాత బుడ్డా వెంగళరెడ్డి కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేయాలని రెండేళ్లుగా ప్రయత్నాలు సాగిస్తున్నామన్నారు. ఇటీవల జరిగిన కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో విగ్రహాల ఏర్పాటును ఆమోదిస్తూ తీర్మానం చేశారన్నారు. విగ్రహ శంకుస్థాపనల కోసం ఈనెల 22వ తేదీ లోపు తమకు స్థలం కూడా కేటాయించాలని కోరారు. ప్రభుత్వం జనవరి 11న ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి ముఖ్య అనుచరుడైన వడ్డె ఓబన్న జయంతిని రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అదేవిధంగా నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి జయంతిని కూడా నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీ రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు లింగందిన్నె విజయభాస్కర్ రెడ్డి, సీహెచ్‌ఆర్‌డీ అధ్యక్షులు పుత్తా శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థల కోసమే కేంద్ర బడ్జెట్


నిరసన తెలుపుతున్న వామపక్ష సంఘాల నేతలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఇటీవల బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టిన బడ్జెట్‌గా ఉందని వామపక్ష సంఘాల నాయకులు నాగసుబ్బారెడ్డి, దస్తగిరి రెడ్డి, అన్వేష్, మనోహర్ పేర్కొన్నారు. బుధవారం కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను నిరసిస్తూ రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి నిధుల కేటాయింపు పెంచాలని, కార్మిక హక్కులను కాల రాసే విధంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ .. కాకులను కొట్టి గద్దలకు పెట్టిన చందంగా ఉందని విమర్శించారు. వ్యవసాయ కూలీలు, కౌలు రైతుల గురించి ప్రస్తావనే లేదన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు, కనీస మద్దతు ధరలకు సంబంధించి బడ్జెట్ లో వాటి జాడే లేదన్నారు. ఉపాధి హామీ పథకానికి, విద్య, వైద్య రంగాలకు భారీగా నిధులు కోత పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. విభజన హామీలను పక్కన పెట్టి ఆంధ్ర రాష్ట్రానికి మొండి చేయి చూపడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు వేణుగోపాల్, రామ్మోహన్, సుబ్రహ్మణ్యం చంద్రారెడ్డి, మద్దిలేటి, బాదుల్లా, రామకృష్ణారెడ్డి, సురేష్, సుబ్బరాయుడు, నారాయణ, నాగరాజు, మల్లికార్జున, విజయ్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీఎస్ ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గజపతి కోరారు. బుధవారం ఈ మేరకు ఆయన కడప ఈడీ పైడి చంద్రశేఖర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జోన్‌లో వివిధ విభాగాలలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు యాజమాన్యం నిర్ణయించిన వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఇచ్చే వేతనాల్లో భారీ వ్యత్యాసాలు ఉన్నాయని, కాంట్రాక్టర్ ద్వారా సక్రమంగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీపీటీడీ ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గంగాంజనేయులు, కడప జిల్లా అధ్యక్షుడు విజయ్, కడప జిల్లా కార్యదర్శి స్టీఫెన్ ఆంటోనీ, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు గౌరీ శంకర్, నంద్యాల జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు ధర్మానాయక్, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల హక్కుల కోసం పోరాటం


మాట్లాడుతున్న ఎన్‌ఆర్ జేఏసీ కన్వీనర్ అహ్మద్ బాబు భాయ్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : మైనార్టీలు రాజ్యాంగం ద్వారా వారికి రావాల్సిన హక్కులను సాధించుకోవాలంటే పోరాటాల ద్వారానే సాధించుకోవాలని ఎన్ఆర్ జేఏసీ కన్వీనర్ అహ్మద్ బాబు భాయ్, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. రవి శంకర్ రెడ్డి, ఆప్‌కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మక్బూల్ బాషా పేర్కొన్నారు. బుధవారం నగరంలోని షాహి దర్బార్ మీటింగ్ హాల్‌లో ఆప్ కి ఆవాజ్ 3వ జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ముస్లిం వర్గాలపై ఆంక్షలు విధిస్తోందన్నారు. ఐక్యంగా ఉన్న ప్రజల మధ్య గొడవలు సృష్టించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఖాసిం, నాయకులు సయ్యద్ చాన్ బాష, షాజహాన్, మహబూబ్ బాషా, అబ్దుల్ సయ్యద్, మౌలా రిజ్వానా, మెహనూర్, గౌసియా, అబీద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్ డీన్‌గా దాము


ఆచార్య ఏజీ దాముకు నియామక పత్రాన్ని అందచేస్తున్న వీసీ ఆచార్య కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం, కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ ఏజీ దామును ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్ డీన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. విశ్వవిద్యాలయంలోని వీసీ చాంబర్‌లో ఆచార్య ఎ.జి.దాము కు ఉపకులపతి ఆచార్య కె. కృష్ణారెడ్డి, కులసచివులు ఆచార్య పి పద్మ, ప్రధానాచార్యులు ఎస్. రఘునాథరెడ్డితో కలసి నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యాక్రమంలో ప్రజాసంబంధాల విభాగ సంచాలకులు డా.పి.సరిత, సహ ఆచార్యులు డా.వెంకట్రామ్ పాల్గొన్నారు.

సంపద సృష్టి అంటే చార్జీలు పెంచడమేనా..?


మాట్లాడుతున్న పాకా సురేష్

కడప కార్పొరేషన్ : సంపద సృష్టించడం అంటే అన్ని రకాల చార్జీలు పెంచడమేనా అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాకా సురేష్ ఎద్దేవా చేశారు. బుధవారం తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2025 ఫిబ్రవరి నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు 20 నుంచి 40 శాతం వరకూ భారీగా పెంచారన్నారు. రూ.20వేల కోట్ల ఆదాయమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ చార్జీలు పెంచారన్నారు. అమరావతి కోసం బాబు అప్పులు చేస్తూ...ఆ అప్పులు, వడ్డీ కలిపి ప్రజల నెత్తిన వేస్తున్నారన్నారు. రాష్ట్రంలో పనులు దొరక్క ప్రజలు వలసలు పోతున్నారన్నారు. సూపర్ సిక్స్ పేరుతో గద్దెనెక్కిన బాబు, విద్యుత్ చార్జీలు మొదలు కొని అన్ని చార్జీలు పెంచుతూ ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. చార్జీలను వెంటనే తగ్గించకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

పరీక్షల విధులకు అవకాశం కల్పించాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా త్వరలో జరగబోతున్న ఇంటర్ ప్రాక్టికల్, థియరీ పరీక్షల విధులకు హైస్కూల్ ప్లస్‌లో పనిచేస్తున్న తమకు అవకాశం కల్పించాలని జిల్లా పీజీటీ సంఘం నాయకులు విన్నవించారు. ఈ మేరకు బుధవారం ఇంటర్ ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్యను కలిసి తమ సంఘం తరుపున వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ చెరుకూరు శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు ఆవుల వెంకటేలు మాట్లాడుతూ హైస్కూల్ ప్లస్‌లో పనిచేస్తున్న అధ్యాపకులకు డిపార్ట్‌మెంట్, స్క్వాడ్ డ్యూటీతోపాటు పరీక్షల అనంతరం స్పాట్ వాల్యూషన్ డ్యూటీలకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీజీటీ సంఘం జిల్లా సెక్రటరీ సురేష్‌కుమార్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు అవారు రమేష్ పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : చాపాడు సీబీఐటీ కాలేజీ విద్యార్థిని వైష్ణవి ఆత్మహత్యపై అనేక అనుమానాలు ఉన్నాయని, సిట్టింగ్ జడ్జితో కాలేజీ యాజమాన్యాన్ని విచారిస్తే నిజానిజాలు బయటికి వస్తాయని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్ తెలిపారు. బుధవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థిని మృతికి కాలేజీ యాజమాన్యం వేధింపులా, లేక ఇతర కారణాలు ఉన్నాయా అన్న కోణంలో విచారణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ ఆవరణలో నిరసన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నగర శివార్లలోని రిమ్స్ ఆసుపత్రిలో పారా మెడికల్ విద్యార్థులతో అధికారులు పారిశుద్ధ్య పనులు చేయించడం దారుణమని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్ పేర్కొన్నారు. బుధవారం ఈ మేరకు రిమ్స్ ప్రాంగణంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారామెడికల్ కోర్సులలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఇంటర్న్‌షిప్ కోసం రిమ్స్ ఆస్పత్రిలో డ్యూటీస్ కి వెళ్తుంటే వాళ్లతో అటెండర్లు చేయవలసిన పనులను చేయించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి శివ తేజ, నాయకులు ఈశ్వర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులకు జీతభత్యాలు పెంచాలి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల జీతభత్యాలను పెంచడంతోపాటు రాజకీయ తొలగింపులు ఆపాలని ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగ సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరంలో ఏపీ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం, ఏఐటీయూసీ అనుబంధం కడప జిల్లా సమితి ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయంలో ఏడీ మునీర్ ఖాన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం ఏఐటీయూసీ అనుబంధం కడప జిల్లా గౌరవ అధ్యక్షులు చాంద్ బాష, ఏఐటీయూసీ కడప నగర ప్రధాన కార్యదర్శి ఉద్దె మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

రుణాలు మంజూరు చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : బీసీ, ఓబీసీ కార్పొరేషన్ రుణాల మంజూరు కోసం నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకున్నారని వీటిలో పారదర్శకంగా ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణాలు మంజూరు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. బుధవారం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నోటిఫికేషన్లు లేవని, ఉద్యోగాల భర్తీ ఇప్పట్లో లేవని కనీసం రుణాలు మంజూరు చేస్తే చిన్నపాటి వ్యాపారాలు చేసుకోవడానికి యువతకు ఉపయోగపడుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బా నరసింహులు, నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

మహిమగల తల్లి లూర్దుమాత


దైవ సందేశాన్ని అందజేస్తున్న రెవరెండ్ ఫాదర్ బడుగు శ్యాంసన్


లూర్దుమాత ప్రతిమతో విశ్వాసుల ఊరేగింపు

కడప కల్చరల్ : జీవితంలో ఎన్నో అద్భుతాలను చూపిన దివ్య మహిమలు గల లూర్దుమాత విశ్వాసులకు తల్లి లాంటిదని జమ్మలమడుగు విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ బడుగు శ్యాంసన్ అన్నారు. లూర్దుమాత నవదిన కార్యక్రమాల్లో భాగంగా నాల్గవరోజు బుధవారం సాయంత్రం 5.30 గంటలకు మరియాపురంలోని పెద్ద చర్చి ఆవరణలో విశేష ప్రార్థనలు చేశారు. తొలుత ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకీపై లూర్దుమాత స్వరూపాన్ని నిలిపి విశ్వాసులు ఊరేగింపుగా మరియాపురం వీధుల ద్వారా స్తుతి గీతాలు ఆలపిస్తూ ప్రధాన ప్రార్థనా వేదిక వద్దకు చేరుకున్నారు. అక్కడ ఆ స్వరూపాన్ని వేదికపై ప్రతిష్ఠించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాదర్ బడుగు శ్యాంసన్ మాట్లాడుతూ మరియమాత తన కుమారుడైన ఏసు క్రీస్తును మానవలోకానికి తీసుకు రావడమే ఒక అద్భుతమని, ఆయన ద్వారా ఈ లోకంలో ఎన్నో అద్భుతాలు చూపిందన్నారు. ప్రార్థించిన వారి మనసు తెలిసి వారి ఆకాంక్షలను నెరవేర్చారని తెలిపారు. ఆమెను ప్రార్థిస్తే నేరుగా ప్రభువైన ఏసుక్రీస్తును ప్రార్థించినట్లే నన్నారు. క్రీస్తును ప్రార్థిస్తే ఆ తల్లికి చేరతాయని, ఆ సమస్యలకు ఆమె సమాధానం చెబుతారని వివరించారు. ప్రొద్దుటూరు డీన్ గురువులు, రెవరెండ్ ఫాదర్ లక్కినేని పీటర్ ప్రభాకర్ దివ్య బలిపూజ నిర్వహించారు. మరియదళ సభ్యులు పీఠాన్ని అలంకరించి స్తుతి గీతాలను ఆలపించారు.

అవగాహనతోనే వారసత్వ సంపదకు రక్షణ


పోటీలో పాల్గొన్న విద్యార్థులు, ఇంటాక్ ప్రతినిధులు

కడప కల్చరల్ : నేటితరం బాలలకు వారసత్వ సంపద విలువపై అవగాహన కల్పిస్తేనే దాన్ని రక్షించుకోవచ్చని వైఎస్సార్ ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ వీసీ డాక్టర్ విశ్వనాథ్‌కుమార్ అన్నారు. భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు సెలబ్రేటింగ్ ఇండియా పేరిట పోస్టర్ తయారీ పోటీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అపురూపమైన వారసత్వ సంపద ఉందని, మన దేశం ఏమాత్రం తక్కువ కాదని, రాయలసీమలో కూడా ఎంతో విలువైన వారసత్వ సంపద ఉందన్నారు. ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో మన చరిత వారసత్వ బులిటిన్‌ను ప్రతినెలా ప్రచురిస్తున్నామని, ఈ మాసం నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాలలో కూడా ఈ పత్రిక అందుబాటులో ఉంటుందన్నారు. ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీర సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటాక్ సేవలు విలువైనవన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్‌కడప అన్నమయ్య జిల్లా అధ్యక్షులు వెంకటసుబ్బయ్య, పూర్వ అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి, ఎస్సీ సంక్షేమశాఖ ఉప సంచాలకులు వల్లూరు బ్రహ్మయ్య పోటీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో కో కన్వీనర్ సుబ్బారెడ్డి, సభ్యులు సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సుబ్బా రెడ్డి, ప్రతినిధులు రాఘవేంద్రవర్మ, సుభక్త్ తాహీన్, బాలోత్సవ్ ప్రతి నిధి నాగమల్లారెడ్డి, కొండారెడ్డి, భారవి పాల్గొన్నారు.

ఉత్సాహంగా : నగరానికి చెందిన 119 మంది విద్యార్థులు పోస్టర్ డిజైనింగ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరికి ఇంటాక్ రీజినల్ స్థాయి బహుమతులు ఇవ్వనున్నారు.

బలిజలకు రిజర్వేషన్లు కల్పించాలి


మాట్లాడుతున్న ఎస్వీ రాము

కడప రూరల్ : సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు బలిజ, కాపు, వెలగ, ఒంటరి ఉప కులాలకు 5 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని రాయలసీమ బలిజ సంఘం ఐక్య పోరాట సమితి అధ్యక్షులు ఎస్వీ రాము తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు బలిజలకు 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ఆ మేరకు ఒక కమిటీ ద్వారా అమలు కోసం నివేదికను కేంద్రానికి పంపారని తెలిపారు. ఇందుకు బదులుగా అప్పటి కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్ల అమలు రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోనే ఉంటుందని చెప్పిందన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నారని, ఆయన ఇచ్చిన హామీని అమలు చేయాల్సిన బాధ్యత ఆయనపైనే ఉందన్నారు. తక్షణం 5 శాతం రిజర్వేషన్లు కల్పించి బలిజ వర్గాలకు న్యాయం చేయాలని తెలిపారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలను చేపట్టడంతో పాటు ఆగస్టు 15వ తేదీ నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేపడుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జే. భాస్కర్, రామా శ్రీనివాసులు, ఆరె వెంకటేశ్వర్లు, చలమల మురళి తదితరులు పాల్గొన్నారు.